## క్లుప్తంగా

### పింఛన్ అందజేత

బిక్కవోలు: ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా వరుసగా రెండు రోజులు బ్యాంకులకు సెలవు రావడంతో ప్రతి నెల ఒకటో తేదీన ఇచ్చే పింఛన్ మండలవ్యాప్తంగా సోమవారం పంపిణీ చేశారు. ఈ దఫా పింఛన్ పంపిణీలో వలంటీర్లతో పాటు గృహసారథులు సైతం పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో లబ్ధిదారుల్ని అడిగి తెలుసుకున్నారు.

### తొస్సిపూడిలో వైద్య శిబిరం



శిబిరంలో రోగుల్ని పరీక్షిస్తున్న దంత వైద్యులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి బ్లెస్సింగ్ చర్చి ఆవరణలో హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్యులు 86 మంది రోగులను, దంత వైద్యులు 74 మంది రోగులను పరీక్షించారు. వారిలో 8 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ సత్య సమర్పణ్ పాల్గొన్నారు.

### కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

రాజానగరం: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థి దశ నుంచే కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వల్లీ మాధవి అన్నారు. కళాశాలకు దత్తత గ్రామమైన వెలుగుబందలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికంగా వస్తున్న మార్పులతో ప్రస్తుతం అన్నీ కంప్యూటర్లలోనే భద్రపరుస్తున్నామన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలన్నీ కంప్యూటర్ పరిజ్ఞానంతోనే లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డీహెచ్ఎస్ కుమార్, జి.శేషుకుమార్ పాల్గొన్నారు.

### 980 మందికి వైద్యసేవలు



సీతానగరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సీతానగరంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 980 మందికి వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం చేశారు. జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.రాధాకృష్ణ, సూపర్‌వైజర్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌సీ రూప్ కుమారి, ఏఎన్ఎంలు మున్నీషా బేగం, సలీమా బేగం, ఆశ వర్కర్లు సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు.

### నేడు గాదరాడలో గడపగడపకూ

మధురపూడి: కేరుకొండ మండలం గాదరాడ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు తెలిపారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు హాజరుకావాలన్నారు.

### ఇలపల్లిలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



ఇలపల్లిలో డ్వాక్రా సభ్యులకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎంపీపీ జ్యోతిర్మయి తదితరులు

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లి గ్రామంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతిలు ముఖ్యఅతిథులుగా హాజరై డ్వాక్రా సంఘాల సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సువర్ణలత, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

### పలువురికి వైద్యసేవలు



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ తదితరులు 220 మందికి వైద్యసేవలు అందించారు. ఎస్.సుధాకర్, కె.శ్రీనివాస్, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వెంకట నారాయణ పాల్గొన్నారు.

# 'ఆహా'రం... ఆరోగ్యం..

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో భరోసా
- లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ
- నియోజకవర్గంలో 3,114 మందికి లబ్ధి



జి.మామిడాడలో లబ్ధిదారులకు అందజేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు

పెదపూడి: అందరికీ ఆరోగ్యం.. అదే మహాభాగ్యం.. తద్వారా ఇంటింటా సౌభాగ్యం.. అందుకే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తోంది. కొన్నేళ్ల కిందట గర్భిణులు, బాలింతలు పోషకాహారం తినకపోవడంతో ఆరోగ్యపరంగా ఇబ్బంది పడేవారు. ప్రసవ సమయం, ప్రసవానంతరం రక్తహీనతతో మృతి చెందేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్రారంభించారు. ఈ పథకంలో గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవానంతరం ఆరు నెలల వరకు నెలవారీ ఆరు రకాల పౌష్టికాహార పదార్థాలతో కిట్ అందిస్తున్నారు. వీటితో పాటు పోషక విలువలతో కూడిన భోజనాన్ని మధ్యాహ్నం అందిస్తున్నారు. భోజనానికి రాని వారికి రోజుకో గుడ్డు, వారానికి లీటర్ పాలు సరఫరా చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతల ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో 265 అంగన్‌వాడీ కేంద్రాలకు 1490 మంది గర్భిణులు, 1624 మంది బాలింతలు ఉన్నారు. అనపర్తి మండలంలో 66 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 344 మంది గర్భిణులు, 410 మంది బాలింతలు ఉన్నారు.

పెదపూడి మండలంలో 81 కేంద్రాలకు 379 గర్భిణులు, 406 మంది బాలింతలు, రంగంపేట మండలంలో 48 కేంద్రాలకు 443 మంది గర్భిణులు, 407 బాలింతలు, బిక్కవోలు మండలంలో 70 కేంద్రాలకు 324 మంది గర్భిణులు, 401 మంది బాలింతలు ఉన్నారు.

**వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్ ఇలా**

ఈ కిట్‌లో కేజీ రాగి(చోడి) పిండి, కేజీ చిరుధాన్యాల పిండి, కేజీ అటుకులు, పావు కేజీ శనగ చెక్కీ, పావు కేజీ బెల్లం, పావు కేజీ ఎండు ఖర్జూరం.. మొత్తంగా ఆరు రకాల ఆహార పదార్థాలుంటాయి.

**నాణ్యత బాగుంది**



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా ఇస్తున్న ఆరు రకాల పదార్థాలు చాలా బాగున్నాయి. సక్రమంగా వాడుతున్నాను. వీటితో పాటు గుడ్లు, పాలు ఇస్తున్నారు. పౌష్టికాహారం తినడం వల్ల నా ఆరోగ్యం బాగా మెరుగుపడింది.

– అరిగెల శ్రావణి, బాలింత, జి.మామిడాడ

**ప్రతి ఒక్కరూ వినియోగిస్తున్నారు**



అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషకాహార కిట్లు ఇస్తున్నాం. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ కిట్లను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– ఎస్.భవానీ, అంగన్‌వాడీ కార్యకర్త, జి.మామిడాడ

**అర్హులందరికీ అందజేస్తున్నాం**



ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సరఫరా చేస్తోంది. వీటిని అర్హులందరికీ సకాలంలో అందజేస్తున్నాం. వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీగౌరి, పెద్దాడ సెక్టార్ సూపర్‌వైజర్, పెదపూడి మండలం

## మహిళలంతా జగనన్నకు అండగా నిలబడాలి



డ్వాక్రా మహిళలకు ఆసరా లబ్ధి చెక్కును పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

పెదపూడి: మహిళల అభ్యున్నతికి అనేక మహిళ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా అండగా నిలబడాలని జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. పుట్టకొండ, సంపర గ్రామాల్లో సర్పంచ్‌లు వల్లు వెంకటరమణ, అద్దంకి మాచరమ్మల అధ్యక్షతన సోమవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్ధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు యన్నన మనోజ్, ఎస్వీ స్వామి, ఏపీఎం చినబాబు, సీసీ పుష్పలత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సోదరులుగా సమస్యలను పరిష్కరించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు

బిక్కవోలు: సోదరులుగా సమస్యలను పరిష్కరించుకుందామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన నాగరాజు(బాజ్జి)అన్నారు. సోమవారం మండలంలోని ఆర్ఎస్‌పేట, బిక్కవోలు లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు గరక వెంకటరాజు అధ్యక్షతన జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే అన్నదమ్ములుగా కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలే తప్ప అసోసియేషన్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించొద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాకపల్లి స్వామినాయుడు, ఉపాధ్యక్షుడు గౌతు అర్జుబాబు, సంయుక్త కార్యదర్శి బి.త్రిమూర్తులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గొలుగూరి ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ

గోకవరం: కల్తీమాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం పశుసంవర్ధక శాఖ డీడీ కె.సత్యనారాయణ హెచ్చరించారు. గోకవరంలో కల్తీమాంసం విక్రయాలను అరికట్టాలని గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఆయన గోకవరంలో మాంసం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాంసం విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అధికారుల పర్యవేక్షణలో విక్రయాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అన్ని రకాల మాంసం విక్రయాలు ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివలన ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇకపై గోకవరంలో విక్రయించే మేక మాంసంపై కచ్చితంగా సీలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కల్తీ మాంసం విక్రయించినట్టు ఫిర్యాదులు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు గోకవరంలో మాంసం దుకాణాల వద అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని, దీనివలన ప్రజలు పలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి కేటాయించిన స్థలాల్లో మాంసం విక్రయాలు నిర్వహించుకునే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్ఎస్ మూర్తి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయాల వద్ద సంబరాలు



మర్రిపూడిలో కేక్ కట్ చేస్తున్న పంచాయతీ పాలకవర్గం సభ్యులు

రంగంపేట: మర్రిపూడి, జి.దొంతమూరు పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు వేము మాధవి, గోలి రమణ ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. తమ పాలక వర్గాలు పదవిని చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ తమను సర్పంచ్‌గా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పుట్టా సోమన్నచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

సీతానగరం: చినకొండేపూడి పాతపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. తాగునీటితో పాటు మజ్జిగను పంపిణీ చేశారు. సిద్దె నాగరాజు, నందమూరి చిట్టిస్వామి, చిడిపి బుజ్జియ్య పాల్గొన్నారు.

## క్రీడాపోటీల్లో ప్రతిభ




బ్యాడ్మింటన్‌లో విజేతలు

రాజానగరం: విజయవాడలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు 'స్కోప్స్ అలెంటా–23' పేరిట జరిగిన ఫార్మసీ అంతర్ కళాశాలల పోటీలలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బ్యాడ్మింటన్ (డబుల్స్)లో విన్నర్స్‌గా, క్రికెట్‌లో రన్నర్స్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. విజేతలుగా తిరిగి వచ్చిన రెండు టీమ్‌లను సోమవారం అభినందించారు.

## 11 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్రకాశం నగర్: మహాత్మా జ్యోతీరావు పూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 27వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు బత్తిన సుబ్బారావు సేవాసమితి అధ్యక్షుడు బర్రే కొండబాబు తెలిపారు. సోమవారం స్థానిక క్వారీ మార్కెట్ సుబ్బారావు నగర్‌లో రాజహేంద్రవరం గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కానుబోయిన సాగర్, కొండబాబు తదితరులు క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను ఆవిష్కరించారు. టోర్నమెంట్‌ను ఎంపీ భరత్ రామ్ ప్రారంభిస్తారని నిర్వాహకులు చెప్పారు.

# ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



జి.మామిడాడలో పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనపర్తి: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. మండలంలోని కుతుకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనపర్తిలోని బాలుర, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలు, అనపర్తి జీబీఆర్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తంగా 811 మంది విద్యార్థులు తొలిరోజు పరీక్ష రాశారు. నాలుగు పరీక్షా కేంద్రాలను స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ డి.మధుసూదనరావు పరిశీలించారు. స్థానిక అనపర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని పరీక్షకు హాజరుకాలేదని ఎంఈఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

**ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు**

పెదపూడి: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెదపూడిలో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంపర పాఠశాల, జి.మామిడాడ బాలుర జెడ్పీటీసీ ఉన్నత పాఠశాల, జి.మామిడాడలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో మొత్తం 789 విద్యార్థులకు గాను 787 మంది పరీక్ష రాశారన్నారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తంగా 619 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

రంగంపేట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలోని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగంపల్లి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తంగా 575 మంది విద్యార్థులు తొలిరోజు పరీక్ష రాశారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ వాకాడ అమ్మాజీ, ఫ్లయింగ్ స్క్వాడ్ గౌరమ్మ తనిఖీ చేశారు.

**ప్రశాంతంగా పరీక్షలు**

రాజానగరం: మండలంలో ఎంపిక చేసిన ఎనిమిది సెంటర్లలో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఈఓ ఎం.రామన్నదొర తెలిపారు. రాజానగరం, దివాన్‌చెరువు, నరేంద్రపురం, సంపత్‌నగరం, కొండగుంటూరులోని కేంద్రాల్లో 1,108 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, మొదటి రోజు ముగ్గురు హాజరుకాలేదన్నారు. ప్రతి సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.

**సీతానగరం మండలంలో..**

సీతానగరం: పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని ఎంఈవో కె.స్వామినాయక్ తెలిపారు. వెదుళ్లపల్లి హైస్కూల్లో 139 మందికి ఒకరు, రఘుదేవపురంలో 220 మందికి ముగ్గురు, సీతానగరం హైస్కూల్లో 124 మందికి ఇద్దరు, చినకొండేపూడి సూర్యచంద్ర హైస్కూల్లో 171 మందికి ఒకరు హాజరుకాలేదన్నారు. చినకొండేపూడిలో 92 మంది పరీక్ష రాశారన్నారు.

**కోరుకొండ మండలంలో..**

మధురపూడి: కోరుకొండ మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 1,106 మంది విద్యార్థుల పరీక్షలు రాశారు. మొత్తం 1,110 మంది విద్యార్థులకు నలుగురు గైర్హాజరయ్యారు.

**గోకవరం మండలంలో**

గోకవరం: మండల వ్యాప్తంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 776 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 773 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పలు పరీక్ష కేంద్రాలను ఎంఈఓ బి.గౌరమ్మ తనిఖీ చేశారు.

## సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మర్రిపూడిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

రంగంపేట: మర్రిపూడి, సింగంపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు వేము మాధవి, తుట్టా శివశంకర్ ఆనంద్ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక పథకాలు అమలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రవిశంకర్, పార్టీ కన్వీనర్ వేము చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## గృహ సారథులే జగనన్న రథ సారథులు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రవిశంకర్

రంగంపేట: గృహ సారథులే జగనన్న రథ సారథులని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు అన్నారు. సింగంపల్లి, దొడ్డిగుంట గ్రామాల్లో సోమవారం జరిగిన గృహ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహ సారథులందరూ ప్రజలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీకి ప్రజలకు వారధులుగా నిలవాలని మండల వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రవిశంకర్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, అడబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

మధురపూడి: కోరుకొండ రాజబాబు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో మంగళవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతోందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



**మండల ప్రజా పరిషత్ కార్యాలయము, పోలవరం**
**కార్యాలయము ఫోన్ నెం.08811-251250**

ఆర్.నెం.సి.బి/20/2023-24 తేది.31-03-2023

**పోలవరం – పురుషోత్తపట్నం ఫెర్రీ టెండరు కం బహిరంగ వేలము ప్రకటన**

ది.11-04-2023 వ తేదీన మంగళవారం మధ్యాహ్నం 2.00 గంటలకు పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు 2023-24 సం.రం.నకు (01-04-2023 నుండి 31-03-2024) టోల్స్ వసూలు చేసుకొనుటకు సీల్డ్ టెండరుతో కూడిన బహిరంగ వేలము నిర్వహించబడును. ఆసక్తి గల కాంట్రాక్టర్లు టెండరు కం బహిరంగ వేలము నందు పాల్గొనవలసినదిగా కోరడమైనది.

| వరుస నెం | టెండరు వివరములు | టెండరు విలువ |
|---|---|---|
| 1. | పోలవరం-పురుషోత్తపట్నం 2023-24 సం.రం.నకు సుంకం వసూలు కాలము | 01-04-2023 నుండి 31-03-2024 |
| 2. | ప్రభుత్వం వారు నిర్ణయించిన కనిష్ఠ వేలము రేటు | రూ.10,04,000/- |
| 3. | సాల్వెన్సీ మొత్తము | రూ.10,01,000/- |
| 4. | టెండరు షెడ్యూలు ఖరీదు | రూ.500/- |
| 5. | సేల్స్ టాక్స్ | రూ.100/- |
| 6. | షెడ్యూలు ఖరీదు చెల్లించవలసినదిగా విధానము | 8448-109-001 మండల ప్రజా పరిషత్ పోలవరం పద్దున ట్రెజరీ ద్వారా చలానా రూపంలో కట్టవలెను |
| 7. | టెండరు షెడ్యూల్ కొరకు దరఖాస్తు స్వీకరించు తేది మరియు సమయం | 02-04-2023 నుండి 10-04-2023 వరకు సాయంత్రం 5.00 గం.ల వరకు (కార్యాలయపు పనివేళల యందు) |
| 8. | టెండరు షెడ్యూలు స్వయముగా ఈ కార్యాలయమునకు అందజేయవలసిన ఆఖరి తేది | ది.11-04-2023 మధ్యాహ్నం 12.00 గం.ల వరకు |
| 9. | బహిరంగ వేలము తేది మరియు సమయం | ది.11-04-2023 మధ్యాహ్నం 2.00 గం.లకు మండల ప్రజా పరిషత్ కార్యాలయమునందు |
| 10. | సీల్డ్ టెండరు తెరచు తేది మరియు సమయం | ది.11-04-2023 న జరుగు బహిరంగ వేలము తదుపరి టెండర్లు తెరవబడును |
| 11. | టెండర్లు తెరచుట/బహిరంగ వేలము జరుగు ప్రదేశం | మండల ప్రజా పరిషత్ కార్యాలయము, పోలవరం |

టెండర్లు తిరస్కరించుట గాని, వేలం ప్రక్రియ వాయిదా వేయుటకు గాని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల ప్రజా పరిషత్,పోలవరం వారికి పూర్తి హక్కులు కలవని తెలియ చేయుచూ, టెండరు షరతులు వేలం నిబంధనలు మరియు ఇతర సమాచారం కొరకు కార్యాలయపు పనివేళలో సంప్రదించవలెను.

స్థలం : పోలవరం,
తేది.31-03-2023

మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, పోలవరం